# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-07-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **దేశం కోసం పోరాడిన సైనికుల త్యాగాలను యావత్ భారతావని ఎప్పటికీ స్మరించుకుంటుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**

**2.** **రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు.**

**3.** **రాష్ట్ర శాసన సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రం విడుదల చేశారు.**

**4.** **రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.**

**5.** **రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి తెలిపారు.**

===========================

దేశం కోసం పోరాడిన సైనికుల త్యాగాలను యావత్ భారతావని ఎప్పటికీ స్మరించుకుంటుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. కార్గిల్ 25వ విజయ దివస్‌ను పురస్కరించుకుని ఈరోజు ప్రధానమంత్రి లద్దాఖ్‌లోని యుద్ధ స్మారకాన్ని సందర్శించి అమర జవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్గిల్ యుద్ధానికి లద్దాఖ్ సాక్షిగా నిలుస్తుందని, అమరుల త్యాగాలకు గుర్తుగా విజయ్ దివస్ జరుపుకుంటున్నామన్నారు. భారత సైనికుల బలానికి, శౌర్యానికి కార్గిల్ విజయ గాథ నిదర్శనంగా నిలుస్తుందని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ (30 సెకన్లు )

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. 25వ కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని విశాఖపట్నంలోని తూర్పునావికాదళం ఆధ్వర్యంలో విజయ్ దివస్‌ను బీచ్ రోడ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూర్పు నావికాదళ ప్రధాన అధికారి వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యంత ప్రతికూల పరిస్థితిలోనూ భారత సైన్యం సాధించిన విజయం చిరస్థాయిగా నిలిచిపోయిందని తెలిపారు.

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో కార్గిల్ యుద్ధంలో ప్రాణ త్యాగం చేసిన అమర జవాన్లను స్మరించుకుంటూ కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు పాల్గొని, విద్యార్థులకు పుస్తకాలు పంపిణి చేశారు.

కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని శ్రీకాకుళంలోని ఏడు రహదారుల కూడలిలో బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. కార్గిల్ వీరుల త్యాగాలను స్మరించుకుంటూ విజయ్ దివస్‌ను జరుపుకుంటున్నామన్నారు.

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సైనికుల పార్కులో ఉన్న అమర జవాన్ల విగ్రహాలకు బీజేపీ నాయకులు సోము వీర్రాజు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అమరవీరుల త్యాగాలను, స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన అవసరముందని పశ్చిమగోదావరి జిల్లా మాజీ సైనికోద్యోగుల సంఘ కన్వీనర్ టి. భోగేశ్వరరావు తెలిపారు. తాడేపల్లి గూడెంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి పోలీస్ ఐలాండ్ వరకు కొవ్వుత్తుల ర్యాలీని నిర్వహించారు.

---------------------------

రాష్ట్ర శాసనసభ సమావేశాలు ఐదవరోజు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఈరోజు ప్రశ్నోత్తరాలు కొనసాగాయి. అనంతరం రాష్ట్ర శాసన సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ అపసవ్య విధానాల వల్ల రాష్ట్రం ఆర్థిక పరంగా తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటోందని తెలిపారు. గతంలో ఐదేళ్ళ మౌలిక సౌకర్యాలకు 64 వేల కోట్ల రూపాయలను టిడిపి హయాంలో కేటాయించామన్నారు. వాటిని వినియోగించుకునేలా చర్యలు తీసుకుని ఉంటే అమరావతి నిర్మాణానికి దోహదపడేదని తెలుపుతూ...

..వాయిస్...

ఇలా ఉండగా... శాసనసభ సమావేశాలు ముగిసిన అనంతరం ముఖ్యమంత్రి ఈ రోజు సాయంత్రం ఢిల్లీ బయలుదేరి వెళ్లనున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన రేపు జరిగే నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు.

---------------------------

రాష్ట్రంలో పత్రికలకు ప్రకటనలు జారీ చేయడంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. పత్రికలకు ప్రకటనలు ఇవ్వడంలో గత ప్రభుత్వం అనేక అక్రమాలకు పాల్పడిందని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు మంత్రి సమాధానం చెబుతూ, పత్రికలకు ప్రకటనలు జారీ చేయడంలో పక్షపాత వైఖరి ప్రదర్శించారన్న విషయం స్పష్టమైందని, ఇందుకు సంబంధించి ఒక జి.ఓ. ఆధారంగా చేసుకుని ఈ అవకతవకలు జరిగాయని తెలిపారు. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని, ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సంప్రదించి ఈ అంశంపై సభా సంఘం ఏర్పాటు చేసే విషయం పరిశీలిస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలపై శాసన సభలో ఈ రోజు పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెబుతూ, రాష్ట్ర వ్యాప్తంగా హోల్ సేల్, రిటైలర్ ...., ఇతర వ్యాపార సంస్థల ప్రతినిధులతో పౌర సరఫరాల శాఖ ఇటీవల సమావేశం నిర్వహించిందని, కొన్ని వస్తువుల ధరలు ఒక క్రమ పద్ధతిలో రాష్ట్రమంతా ఒకే విధంగా ఉండేలా సహకారం అందించేందుకు ప్రతినిధులు సంసిద్ధత వ్యక్తం చేశారని తెలుపుతూ...

వాయిస్ ..25 సెకన్లు

---------------------------

రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలపై శ్వేత పత్రం విడుదల చేయవలసిన అవసరం వుందని ఉప ముఖ్య మంత్రి కె.పవన్ కళ్యాణ్ సూచించారు. పంచాయతీ రాజ్ శాఖకు 14వ, 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల అంశంపై శాసన సభలో ఈరోజు పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెబుతూ.... 2019- 2024 సంవత్సరాల మధ్య ఈ శాఖకు 7 వేల 586 కోట్ల రూపాయల మేర నిధులు జమ అయ్యాయని చెప్పారు. ఈ అంశాలపై శాసన సభ సుదీర్ఘంగా చర్చించాలని, కనీసం నాలుగు గంటల పాటు చర్చ జరగడం అభిలషణీయమని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి తెలిపారు. ఈరోజు తాడేపల్లిలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్యంగా కూటమి ప్రభుత్వం దాడులకు పాల్పడుతోందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాల పేర్లు మార్చి కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన ఐసెట్ కౌన్సెలింగ్ ఈరోజు నుంచి ప్రారంభించినట్లు ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ ఉమామహేశ్వరిదేవి తెలిపారు. ఈ రోజు నుంచి ఆగస్టు 1 వరకు నమోదు ప్రక్రియ, రేపటి నుంచి ఆగస్టు 3 వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని, ప్రత్యేక కేటగిరి ధ్రువపత్రాల పరిశీలన ఆగస్టు 2న నిర్వహించనున్నామని వెల్లడించారు. కోర్సులు, కళాశాలల ఎంపికకు వెబ్ ఐచ్ఛికాల నమోదుకు ఆగస్టు 4 నుంచి 8 వరకు అవకాశం కల్పించామని తెలిపారు. ఆగస్టు 8న ఐచ్ఛికాల మార్పు చేసుకోవచ్చని, 10న కళాశాల ప్రవేశాల కేటాయింపు చేయనున్నామని తెలిపారు.

---------------------------

కార్గిల్‌లో భారత సైనికుల విరోచితపోరాటానికి గుర్తుగా ప్రతి సంవత్సరం కార్గిల్ విజయ దివస్ గా జరుపుకుంటున్నామని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అదనపు డైరెక్టర్ జనరల్ రాజేందర్ చౌదరి తెలిపారు. కార్గిల్ విజయ దివస్‌ను పురస్కరించుకొని ఈరోజు గుంటూరు నగరంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అధ్వర్యంలో కార్గిల్ విజయ గాధలను తెలుపుతూ ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను గుంటూరు పశ్చిమ శాసనసభ్యులు గల్లా మాధవి, గుంటూరు తూర్పు శాసనసభ్యులు నసీర్ అహ్మద్‌లతో కలిసి రాజేందర్ చౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్గిల్ యుద్ధంలో భారత సైనికుల శౌర్యాన్ని ప్రజలకు,

విద్యార్థులకు చాటిచెప్పేలా ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇటువంటి ప్రదర్శనలు దేశ యువత సైన్యంలో చేరేందుకు ప్రోత్సహిస్తాయని పేర్కొన్నారు.

--------------------------

విజయవాడ డివిజన్‌లో నిర్మాణ, నిర్వహణ పనుల కారణంగా పలు రైళ్లను కొద్ది రోజులపాటు రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. పుణె-సికింద్రాబాద్ శతాబ్ది ఎక్స్‌ప్రెస్ ఈ నెల 29, 31, ఆగస్టు 1వ తేదీల్లో రద్దు చేయగా, విజయవాడ-భద్రాచలంరోడ్, విజయవాడ-డోర్నకల్ రైళ్లు ఆగస్టు 5 నుంచి 10వ తేదీ వరకు రద్దయ్యాయని తెలిపింది. అలాగే విజయవాడ-సికింద్రాబాద్ మధ్య నడిచే శాతవాహన ఎక్స్‌ప్రెస్, గుంటూరు-సికింద్రాబాద్ మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లు ఆగస్టు 5 నుంచి 10 వరకు రద్దయ్యాయని పేర్కొంది. వీటితో పాటు డివిజన్ పరిధిలోని పలు రైళ్ళను దారి మళ్ళించినట్లు అధికారులు తెలిపారు.

--------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 112వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.“మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈరోజు సాయంకాలం వరకు పంపవచ్చు.

======================